క్లుప్తంగా

గ్రామ దేవతలకు పూజలు


పుట్టపెద్దమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చారు. అమ్మవారి శాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిచి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఎర్ర నాయక్ కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తలకు సంబధించి ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎర్ర నాయక్‌కు 2005 పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఈ మేరకు బాధితుడికి మంగళవారం తమవంతుగా రూ.18,000 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు రంగడు, కృష్ణారెడ్డి, మౌలాలీ, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి


నివాళులర్పిస్తున్న సగరసేవా సంఘం నాయకులు

బనగానపల్లెరూరల్: సగర(ఉప్పర)సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భగీరథ మహర్షి జయంతిని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని ఫోర్‌లైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భగిరథ మహర్షి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కఠోర తపస్సుతో గంగను భూమికి తీసుకొచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని ఈ సందర్భంగా సగర(ఉప్పర)సేవా సంఘం నియోజవర్గ అధ్యక్షుడు బుర్రా వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పోలూరు కృష్ణ, చిందుకూరి సుబ్రహ్మణ్యం, నీరుకట్టు చెన్నయ్య, చిందుకూరి సురేష్, రిటైర్డ్ ఎస్ఐ పుల్లయ్య, అంగడి కృష్ణ, మధుమోహనకృష్ణ, వర్రమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

బేతంచెర్ల: మండల కేంద్రం తో పాటు గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుకు 41 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయ. ఓ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినింది. ఆయా గ్రామాల్లో కూలిన విద్యుత్ స్తంభాల స్థానాల్లో కొత్తవి ఏర్పాటు చేయిస్తున్నారు ఆ శాఖ అధికారులు. ప్రజలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలో రూ. 6లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ఏడీ మధు సూధన్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక రైతు మృతి


మృతి చెందిన బెల్లం నారాయణ రెడ్డి(ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాల్లె గ్రామానికి చెందిన రైతు బెల్లం నారాయణ రెడ్డి (42) సోమవారం సాయంత్రం పొలం పని చేస్తుండగా భారీ వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లాడు. గాలికి చెట్టు కొమ్మవిరిగి పడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. సమీప పొలాలలోని రైతులు గమనించి రైతు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రైతు బెల్లం నారాయణ రెడ్డిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందారని కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు.

పాండురంగడి బ్రహ్మోత్సవాలకు వేళాయె..!

- భక్తులపాలిట కొంగుబంగారం... పాండురంగ విఠలేశ్వరుడు
- శ్రీకృష్ణదేవరాయల కాలంతో ముడిపడిన ఆలయం
- 17 నుంచి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న పాండురంగ విఠలేశ్వరుని ఆలయం


కొత్త శోభ సంతరించుకున్న ఆలయ ముఖద్వారం

కోవెలకుంట్ల: శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు ప్రజల ఆరాధ్యదైవంగా పూజింపబడుతున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన స్వామివారు భక్తుల కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మితమైన పాండురంగ దేవాలయం నేటికి ప్రత్యేకతను చాటుకుంటుంది. ప్రతి ఏటా వైశాఖ మాసంలో 11రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 17 తేదీ నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరిపేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున కోట, 18న ద్వాదశ కుంభహారతి, పేట, కోనేటి తిరునాల, 19వతేదీ అర్ధరాత్రి స్వామివారి కల్యాణం, 20న స్వామివారు హనుమద్వాహనం, 21న సింహవాహనం, 22న శేషవాహనం, 23న గరుడ వాహనం, 24న గజేంద్రవాహనంతో స్వామి వారు భక్తులకు కనువిందు చేయనున్నారు. 25 తేదీన పూర్ణాహుతి, రథోత్సవం, 26న మైల తిరునాల, 27వ తేదీన వసంతోత్సవం, నాకబలితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా జరుగనున్నాయి.

శ్రీకృష్ణ దేవరాయల కాలంతో ముడిపడ్డ ఆలయ చరిత్ర

శ్రీదేవి భూదేవి సహకిత పాండురంగ విఠలేశ్వర ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. శాలివాహనశకం 1493లో పెనుగొండ మహరాజు తిరుమల దేవమహరాయలు దేశాటనకై ఈ ప్రాంతానికి వచ్చినట్లు చరిత్ర. ఇక్కడున్న జుర్రేరు, కుందూనది జీవనదులుగా ప్రవహిస్తూ చింతవనాలు, నీటికుంటలతో ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండటంతో ఇక్కడ విడిది చేశారు. ఈ ప్రాంతం గురించి కోవెల అనే భక్తురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న సమయంలో ఓరోజు రాత్రి శ్రీపాండురంగ విఠలేశ్వరుడు రాజుకు, కోవెలకు కలలోవచ్చి ఇక్కడ ఒక ప్రాంతం కనుమరుగైందని, గ్రామం నిర్మించి దేవాలయం కట్టించాలని చెప్పినట్లు పూర్వీకుల చరిత్ర. ఇరువురికీ ఒకటేకల వచ్చిందని తెలియడంతో అదే సంవత్సరంలో ఒక పెద్దదేవాలయం నిర్మించి తిరుమలదేవ మహరాయలచేత విగ్రహ ప్రతిష్ట గావించినట్లు శిలాశాసనం చెక్కించారు. కనుమరుగైన గ్రామాన్ని తిరిగి నెలకొల్పడంతో భక్తురాలిపేరుమీద ఈ ప్రాంతానికి కోవెలగా నామకరణం చేశారు. కుంటలో నుంచి గ్రామాన్ని తీసి నిర్మించడంతో కోవెలకుంట... కాలానికనుగుణంగా కోవెలకుంట్లగా మార్పు చెందింది.

పాండురంగ విఠలేశ్వరుడి ఆలయానికి పూర్వ వైభవం

500 సంవత్సరాల క్రితం తిరుమలదేవ మహరాయలచేత నిర్మించబడ్డ పాండురంగస్వామి దేవాలయంలో ప్రతిష్టించిన పాండురంగవిఠలేశ్వరుడు నాటి నుంచి నిత్యపూజలందుకుంటున్నారు. ఐదు శతాబ్దాల కాలం నాటి పురాతన ఆలయం కావడంతో 2018వ సంవత్సరం దాతల సహకారంతో రూ. 1.50 కోట్లతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. రూ. 10 లక్షలతో ఆలయ గర్భగుడి జీర్ణోద్ధరణ, రూ.10 లక్షలతో ఇత్తడి తొడగులు, రూ. 5 లక్షలతో వెండి తొడగులు, రూ. 20 లక్షలతో ఆలయంలోపల, ఆవరణలో ఫ్లోరింగ్, రూ. 4 లక్షలతో ఆర్చీల అభివృద్ధి, రూ. 5 లక్షలతో అద్దాల కల్యాణ మండపం నిర్మించారు. అదేవిధంగా రూ. 4 లక్షలతో పురాతన బావి, రూ. 5 లక్షలతో మూలవిరాట్‌విగ్రహాలు, రూ. 5 లక్షలతో ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్లు, రూ. 10 లక్షలతో గార్డెన్, రూ. లక్షతో పిల్లల పార్కు, రూ. 10 లక్షలతో షాపింగ్‌కాంప్లెక్స్, రూ. 50 లక్షలతో ఇతర అభివృద్ధి పనులతో ఆలయానికి పూర్వ వైభవం వచ్చింది. పురాతన ఆలయం కొత్త శోభ సంతరించుకోవడంతో ఆలయానికి ఐదు శతాబ్ధాల కళ వచ్చింది.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి


ఆలయం ఎదుట కోనేరు


స్వామివార్ల కల్యాణానికి అద్దాల కల్యాణ మండపం

నేడు మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో బుధవారం ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

మహిళపై అసభ్యకర ప్రవర్తన

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించడానికి వచ్చిన స్వతంత్ర అభ్యర్థి పీఎస్ బాబు మహిళపై దాడి చేయడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేసు నమెదు అయ్యింది. హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహం ఆవరణలో ముద్దవరం నాగరాజు భార్య జయలక్ష్మి కసువు ఊడుస్తుండగా అటువైపు ఇండిపెండెంట్ అభ్యర్థి పీఎస్ బాబు తన కారు డ్రైవర్ అతివేగంతో వచ్చారు. కసువు ఊడుస్తున్న జయలక్ష్మి అంత వేగంగా ఎందుకు వచ్చారని, నాకు ఏమైనా జరిగితే ఏలా అని స్వతంత్ర అభ్యర్థి పీఎస్ బాబును అడగగా తన జట్టు పట్టుకొని లాగి, అసభ్యకరంగా మాట్లడటమే కాకుండా కాలితో తన్ని చీరలాగి అవమాన పరిచారని బాధితురాలు జయలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు దాడి కేసుతో పాటు అసభ్య కరంగా ప్రవర్తించారని కేసు నమోదు చేశామన్నారు. ఇదే సమయంలో పట్టణంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి బేతంచెర్ల పట్టణంలో పరిశీలనకు రాగా తనను కులం పేరుతో దూశించడమే కాకుండా తన కారు అద్దాలు పగులగొట్టారని స్వతంత్ర అభ్యర్థి పీఎస్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర రావు, నాగరాజుతో పాటు మరో 30 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా మంగళవారం తెలిపారు.

ఎమ్మెల్యే కాటసాని ఇంట నాయకుల సందడి


వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సరదాగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : ఉత్కంఠంగా సాగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాతంగా ముగియడంతో పోలీసులతోపాటు రాజకీయ నాయకులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల ప్రచారాలు, సమీకరణలతో దాదాపు రెండు నెలలు బిజీబీజీగా గడిపిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం రిలీఫ్ అయ్యారు. కొన్నాళ్ల తర్వాత స్థానిక స్వగహంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబ సభ్యులతో సరదగా గడిపారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను పలుకరించేందుకు పెద్దఎత్తున చేరుకున్నారు. దీంతో ఒక్కసారిగా మళ్లీ సందడి నెలకొంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎమ్మెల్యే కాటసాని ఆప్యాయంగా పలకరించారు. ఆయా గ్రామాల నాయకులు పోలింగ్ సరళిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా స్పందన, ప్రత్యేకించి మహిళలతో వృద్ధులు పోలింగ్ తరలివచ్చిన తీరును నాయకులు ఎమ్మెల్యేకు విశదీకరించారు. సంక్షేమ పథకాల అమలుతీరుపై ప్రజలు సానుకూలంగా ఉన్నారని వివరించగా సంతోషం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ శ్రేణులు కష్టపడిన తీరును గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, బూత్‌కన్వీర్లు గృహ సారథులు, రాజీనామాలు చేసి సహకరించిన వలంటీర్లకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.


24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రీ వెరిఫికేషన్, తప్పిపోయిన సబ్జెక్టులకు ఫీజు చెల్లింపు తేదీల గడువు ముగిసిందన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు.


డై కొడుతున్న యువకుడు

ఈత కొట్టు...సేద తీరు!

సంజామల: సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 10 గంటలకే ఎండలు మండుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. శీతల పాణియాలు సేవిస్తూ ఉపశమనం పొందుతున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి వర్ణనాతీతం. సాయంత్రం ఐదు గంటలైనా వేడి ఏ మాత్రం తగ్గడం లేదు. అయితే గ్రామీణ ప్రాంతాలతో యువత బావులు, తోతట్టు గుంతలు ఆశ్రయిస్తున్నారు. యువత ఈత కొడుతూ సేద తీరుతున్నారు. సరదాగా ఉల్లాసంగా ఈత కొడుతు గడుపుతున్నారు. బావులలో నీరు ఉండడంతో యువత కేరింతలు కొడుతూ సేదతీరుతున్నారు.


బావిలో ఈత కొడుతూ సేదతీరుతున్న యువకులు

ఓటరు చైతన్యం!

- బనగానపల్లె నియోజకర్గంలో పెరిగిన పోలింగ్ శాతం
- 84.40 శాతం నమోదు
- కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 88.08 శాతం
- అవుకు మండలంలో 81.47 శాతం


అంకిరెడ్డిపల్లెలో క్యూలో నిల్చున్న ఓటర్లు(ఫైల్)

కొలిమిగుండ్ల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాతంగా ముగిశాయి. 2024 అసెంబ్లీ,లోక్‌సభ ఎన్నికలకు ప్రాధాన్యత సంతరించు కోవడంతో ప్రధాన రాజకీయ పార్టీలు పోటా పోటీగా ప్రచారాలు నిర్వహించారు. బనగానపల్లె నియోజకవర్గంలో చిన్నచిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాతంగా ముగియడంతో నాయకులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటర్లు కూడా తమ విలువైన ఓటు హక్కు వినియోగించు కునేందుకు ఉదయం ఆరు గంటల నుంచే బారులుదీరారు. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. గంటల తరబడి ఓపికగా నిలబడి తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేశారు ఓటర్లు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం స్వస్థలాలకు వచ్చి ఓటు వేసి వెళ్లారు. ఈ మేరకు పోలింగ్ శాతం కూడా పెరగడంతో ఓటర్లలో చైతన్యం పెరిగిందనే చర్చ మొదలైంది. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాల అందినందునే పోలింగ్ శాతం పెరిగిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కోవెలకుంట్ల నుంచి బనగానపల్లె నియోజకవర్గంగా ఏర్పడింది. 2009 ఎన్నికల్లో 68.23 శాతం పోలింగ్ నమోదు కాగా, 2014లో 64.9 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికలకు వచ్చే సరికి గతంలో జరిగిన రెండు ఎన్నికల కంటే మిన్నగా 83.46 శాతం నమోదైంది. ప్రస్తుత జరిగిన ఈ ఎన్నికల్లో ఏకంగా 84.40 శాతం నమోదు కావడం విశేషం. ఓటర్లు సైతం పెరుగుతూ వచ్చారు. బనగానపల్లె నియోజవర్గంలో మొత్తం ఓటర్లు 2,41,205 మంది ఉండగా 2,03,576 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 84.40 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అత్యధికంగా కొలిమిగుండ్ల మండలంలో 88.08 శాతం పోలింగ్ నమోదైంది. అవుకు మండలంలో తక్కువగా 81.47 శాతం నమోదు అయ్యింది. గ్రామాల్లోనూ 60 శాతం మొదలుకొని అత్యధికంగా 96 శాతం ఓటింగ్ జరగడం విశేషం.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్లు, పోలింగ్ శాతం వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పోలైనఓట్లు	పోలింగ్ శాతం
బనగానపల్లె	85,051	71,747	84.36%
కోవెలకుంట్ల	39,564	32,449	82.02%
కొలిమిగుండ్ల	43,083	37,947	88.08%
అవుకు	41,301	33,648	81.47%
సంజామల	32,206	27,785	86.27%

ఓటర్ల.. ఉత్సాహం

- డోన్ నియోజకవర్గంలో 82.91శాతం పోలింగ్
- గతేడాదికంటే 4.02శాతం అధికం


ఓటు హక్కు వినియోగించుకోవడానికి పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్దకు తరలి వచ్చిన ఓటర్లు(ఫైల్)

డోన్ టౌన్ : ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ శాతం పెరిగడం ఇందుకు సాక్ష్యం. ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 6 గంటలకే కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. డోన్ నియోజకవర్గంలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలు ఉన్నాయి. మొత్తం 2,24,774 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 291 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు అధికారులు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ పక్రియ సాగాల్సి ఉంది. అయితే సాయంత్రం ఆరు గంటలకే పోలింగ్ కేంద్రాలు చేరుకున్న ఓటర్ల కోసం పోలింగ్ రాత్రి వరకు సాగించారు. మొత్తం ఓటర్లలో 1,86,360 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 82.91 శాతం నమోదు అయ్యింది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 2,19,678 మంది ఓటర్లు ఉండగా అందులో 1,73,403 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో 78.93శాతం నమోదు అయ్యింది. ఈ సంవత్సరం ఎన్నికలతో పోల్చుకుంటే 4.02శాతం అధికంగా నమోదైంది.

గ్రామాల్లో పెరిగిన పోలింగ్ శాతం

బేతంచెర్ల : మండలంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ శాతం పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 7గంటలకే పోలింగ్ కేంద్రాల ముందు బారులుదీరారు. ఉదయం అక్కడక్కడ ఈవీయంలు మొరాయించి కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయినా అధికారులు సరిదిద్దారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలలో ఉండడంతో రాత్రి 10గంటలకు పైగా పోలింగ్ సాగింది. దీంతో ఏకగా 86.30 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఓటు హక్కుపై స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. నాగ మళ్లకుంటలో పోలింగ్ 97.78 శాతం, కొమ్మూరు కొట్టాల, గోర్లగుట్ట – 96 శాతం, రేపల్లె గ్రామంలో 96.09 శాతం, రహిమానుపురం అత్యధికంగా 94.16 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

వర్షం.. ఉపశమనం


కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మండలాల్లో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు వేసవి నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. మంగళవారం సబ్ డివిజన్‌లోని సంజామల మండలంలో 8.2 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 4.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. వేసవికాలం కావడంతో రెండు నెలల నుంచి భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు భయపడ్డారు. ఇలాంటి తరుణంలో వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.